హక్కుల కోసం నిలిచేది సిపిఎం ఒక్కటే..

- ప్రజలందరి సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యం
- పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- ఎర్ర జెండాల రెపరెపలతో ఎరుపెక్కిన పటాన్‌చెరు
- మల్లికార్జున్ గెలుపునకు వేలాది బైక్‌లతో భారీ ర్యాలీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలు, కార్మికుల హక్కుల కోసం చట్ట సభల్లో నిలదీసేందుకు సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. కార్పొరేట్, రియల్ ఎస్టేట్ దందా చేసేవాళ్లు కావాలా..? కార్మిక, శ్రామిక ప్రజల కోసం పోరాడే కమ్యూనిస్టులు కావాలో.. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జె మల్లికార్జున్ గెలుపును కాంక్షిస్తూ ఆదివారం బీరంగూడ నుంచి రుద్రారం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కార్మికులు ఎర్రజెండాలు చేతబూని దండుగా కదం తొక్కారు. పటాన్‌చెరు ఎరుపుమయమైం ది. ఐదు గంటల పాటు బైక్ ర్యాలీ కొనసాగింది. బైక్ ర్యాలీని ప్రారంభించిన రాఘవులు అనంతరం మాట్లాడారు.

సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడేది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై శాసన సభలో గళమెత్తే అవకాశం వచ్చిందని, సిపిఎం అభ్యర్థిని ఆదరించి.. ఓట్లేసి ఆశీర్వదించాలని కోరారు. యాజమాన్యాల మేలు కోరే పాలకులు కార్మికులకు ఆపద వస్తే ఎలా ముందుకు వసారని ప్రశ్నించారు. పారిశ్రామిక ప్రాంతంగా విస్తరించినా నియోజకవర్గంలో కార్మికులు, ప్రజలకు కనీస సౌకర్యాలను మెరుగుపర్చేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే కృషి చేయలేదన్నారు. పటాన్‌చెరు ప్రాంతంలో పాలకులు అప్రమత్తంగా లేకపోవడం వల్లే కాలుష్యం కోరలు చాచి ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు.

ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, మరి ప్రతి ఇంట్లో ఆర్వో వాటర్ మిషన్లు ఎందుకు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి విధానాలు ఒక్కటేనని విమర్శించారు. ఒకరు చేసిన తప్పులను మరొకరు ఎత్తిచూపుకోవడం వల్ల ప్రజలకు జరిగే మేలేముందన్నారు. కార్మికులు, పేదలు, శ్రామికుల పక్షాన ఎళ్ల వేలలా నిలిచేది ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. పటాన్‌చెరులో ధన బలం.. సేవా బలం మధ్యనే ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మీ కోసం పోరాడే అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఐదేళ్ల భవిష్యత్‌ను కాపాడుకునేందుకు డబ్బుకు కాకుండా సమస్యలపై పనిచేసే సిపిఎంకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల పక్షాన పోరాడేది ఎర్రజెండానే..

కార్మికుల పక్షాన పోరాడేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనని, సిపిఎం అభ్యర్థి మల్లికార్జున్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు ఓటర్లను కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనాల కోసం పోరాడిన పార్టీ సిపిఎం ఒక్కటేనని చెప్పారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు యాజమాన్యాల ప్రయోజనాల కోసం పనిచేస్తారు తప్ప కార్మికుల వేతనాలు, సమస్యల గురించి పట్టించుకోరన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గెలిచిన వాళ్లెవ్వరూ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, అభ్యర్థి జె మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, నాయకులు కె రాజయ్య, బీరం మల్లేశం, అతిమేల మాణిక్, జి సాయిలు, నాయిని నర్సింహ్మారెడ్డి, రామచంద్రం, నాగేశ్వర్‌రావు, ప్రవీణ్, యాదగిరి, విద్యాసాగర్, మహిపాల్, పాండురంగారెడ్డి, వాజీద్ అలీ, అనంతరావు, రాజు, అశోక్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల ఏర్పాట్లు పూర్తి
- 29న పోలింగ్ స్టేషన్లకు సామగ్రి తరలింపు
- ఎన్నికల నిర్వహణలో 2 లక్షల మంది సిబ్బంది
- సిఇఒ వికాస్‌రాజ్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సిఇఒ) వికాస్‌రాజ్ తెలిపారు. 28న రాష్ట్ర వ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఎన్నికల సామగ్రి చేరుతుందనీ, అక్కడి నుంచి 29న పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని తరలిస్తామన్నారు. ఇవిఎమ్‌ల తనిఖీలు ఈ నెల 24, 25 తేదీల్లో పూర్తయ్యాయని ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఎన్నికల నిర్వహణకు రెండు లక్షల 8 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారనీ, 12 వేల పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామనీ, శాంతియుత నిర్వహణ కోసం ఆయా ప్రాంతాల్లో కేంద్ర బలగాలనూ మోహరించినట్టు తెలిపారు. ఎన్నికల తనిఖీల సందర్భంగా ఇప్పటి వరకు రూ.709 కోట్లకుపైగా సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. 119 నియోజకవర్గాల్లో మొత్తం 2,290 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, వారిలో పురుషులు 2,068 మంది, మహిళలు 221 మంది, ఒక్క ట్రాన్స్‌జెండర్ ఉన్నారని వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 1,68,612 మంది సిబ్బందికి ఫెలిసిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్లు జారీ చేశామన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 1,00,135 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా, ఈసారి వాటి సంఖ్య మరింత పెరిగిందన్నారు. 49 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, 31 జిల్లాల్లో ఒక్కో కౌంటింగ్ సెంటర్, రంగారెడ్డి జిల్లాలో నాలుగు, హైదరాబాద్‌లో 14 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 45 వేల మంది రాష్ట్ర పోలీసులు, మూడు వేల మంది ఎక్సైజ్ సహా ఇతర శాఖల సిబ్బంది, టిఎస్ఎస్‌పి నుంచి 50 కంపెనీలు, 375 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఎన్నికల బందోబస్తులో పాల్గొంటాయని తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి 23,500 మంది హోంగార్డులను కూడా రప్పిస్తున్నామనీ, 1,866 స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద 1,020 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. మంత్రి కె తారకరామారావుకు కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులకు ఇంకా సమాధానం తమకు అందలేదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 21,686 వీల్‌చైర్లు ఏర్పాటు చేశామనీ, బ్రెయిలీలో 76,532 ఓటర్లు స్లిప్పులు ముద్రించామన్నారు. తమకు వస్తున్న ఫిర్యాదులపై సాధ్యమైనంత వేగంగా స్పందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో అడిషనల్ సిఇవో లోకేష్‌కుమార్, డిప్యూటీ సిఇవో సత్యవాణి తదితరులు పాల్గొన్నారు

బిజెపిని ఓడించండి

- సిపిఎం అభ్యర్థులను గెలిపించండి : తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిపిఎం పోటీ చేస్తున్న 19 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బిజెపి అభ్యర్థులను ఓడించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్ల అనుభవం చూసిన తర్వాత శాసనసభలో కమ్యూనిస్టుల అవసరం మరింత పెరిగిందని తెలిపారు. డబ్బు, మద్యం పెద్దఎత్తున ప్రవహిస్తున్న ఈ పరిస్థితుల్లో ప్రజలు సిపిఎంను ఆదరించాలనీ, ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కోరారు. వారు మాత్రమే శాసన సభను ప్రజా సమస్యలపై చర్చించడానికి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి, ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి ఒక వేదికగా వినియోగిస్తారని తెలిపారు. ఇతర పార్టీలకు ఇవి పట్టవని విమర్శించారు. స్వార్థ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలే వారికి ముఖ్యమని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు లేని శాసనసభలో అధికార, ప్రతిపక్షాలనే తేడా లేదన్నారు. పరస్పర నిందలు తప్ప ప్రజా ప్రయోజనాల గురించి పట్టించుకోలేదని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు లేని ఈ లోటును ఈ ఎన్నికల సందర్భంగా పూడ్చడం అవసరమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓట్ల కోసం బిజెపి నాయకత్వం మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. కులాన్ని, మతాన్ని పాచికగా ప్రయోగిస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల దృష్టిని మళ్ళించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క సీటులో కూడా బిజెపి గెలవకుండా ప్రజలు విజ్ఞతను ప్రదర్శించాలని కోరారు. ఆ పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో దాన్ని ఓడించగల పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెంలో సిపిఐ, పినపాకలో సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, శేరిలింగంపల్లిలో ఎంసిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మిగిలిన స్థానాల్లో ఎవరిని బలపరచాలో సిపిఎం జిల్లా కమిటీలు తగు నిర్ణయం తీసుకుని, ప్రజాతంత్ర, లౌకిక, సామాజిక, పోరాట శక్తులకు మద్దతిస్తాయని తెలిపారు.

కెసిఆర్ లక్ష్యంగా కేంద్ర నాయకత్వం దండయాత్ర

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ పార్టీల నేతలంతా తెలంగాణపై కన్నేశారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆరే లక్ష్యంగా కేంద్ర నాయకత్వం దండయాత్ర చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణను చిన్నాభిన్నం చేయాలనేది బిజెపి ప్రయత్నమన్నారు. కులమతాల చిచ్చుతో లబ్ధి పొందాలనుకోవడం మంచిది కాదని హితవు పలికారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ మభ్యపెడుతోందని విమర్శించారు. తాను పార్టీ మారుతున్నట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారని గుత్తా ఆగ్రహం వ్యక్తం చేశారు.

మార్పు కోరుతున్న తెలంగాణ ప్రజలు

- ఏమీ ఇయ్యని ఈ సిఎం మనకు అవసరమా?
- ఎన్నికల ప్రచార సభల్లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ పాలనలో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు మార్పు కోరుతున్నారు.. మనకు ఏమీ ఇయ్యని ఈ ముఖ్యమంత్రి అవసరమా? అని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో, మహబూబ్‌నగర్, నారాయణపేటల్లో సభలు, రోడ్‌షోల్లో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. 60ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష..ఆత్మగౌరవం నిలబెట్టే విధంగా ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతానికి వచ్చి ఉపాధి అవకాశాలు పొందుతున్నారంటే ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవేనని చెప్పారు. ఒకప్పుడు రబ్బరు చెప్పులు లేనోళ్లు.. ఇప్పుడు విమానాల్లో తిరుగుతూ ఫామ్‌హౌస్‌లో గడుపుతున్నారని విమర్శించారు. మీ ఊరు చింతమడకలో నువ్వు చదివిన బడి, గుడి, నీళ్ళు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. 2014లో మహిపాల్ రెడ్డి ఆస్తి ఎంత.. ఇప్పుడు ఎంత అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దగ్గర నాయకులు ఉండొచ్చు, ఆక్రమించుకున్న భూములు ఉండొచ్చు కానీ తమ దగ్గర ప్రజాబలం ఉందన్నారు. ఏమి ఇయ్యని వ్యక్తి..మూడోసారి ముఖ్య మంత్రిగా అవసరమా అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక తప్పకుండా కేసీఆర్ కు చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామని హెచ్చరించారు. ఈసారి ప్రజలంతా ముక్తకంఠంతో మార్పు కోరుకుంటున్నారని, ఈ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగురబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కాటా శ్రీనివాస్‌కు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

నారాయణపేట గడ్డ కాంగ్రెస్‌కు అడ్డ అని రేవంత్ రెడ్డి అన్నారు. నాడు రాష్ట్రం ఏర్పడితే నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొందరికి మాత్రమే లాభం చేరుకుందన్నారు. 69 జీవో ప్రకారం సాగునీరు అందుతుందని, కానీ ఆ జిఒను అమలు పరచక తమ సొంత లాభాల కోసం జీఓని మూసి పెట్టారని చెప్పారు. అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నట్టు ప్రకటించిన రాజేందర్ రెడ్డి ఎందుకు అభివృద్ధి పరచలేదని ప్రశ్నించారు. ఎందుకు రైల్వే లైన్ మంజూరు చేయించలేదని, కొడంగల్ - నారాయణపేట పథకం ఎందుకు కాలేదని ప్రశ్నించారు. ప్రతి ఎకరాకు నీరు అందించిన తర్వాతే ఎన్నికల్లో పాల్గొంటానని శపథం చేసిన ఎస్ రాజేందర్ రెడ్డి.. అది చేయకుండా ఎన్నికల బరిలో ఎందుకు నిలబడ్డారని నిలదీశారు. కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే.. ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. చిట్టెం ఫర్నికరెడ్డికి ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

జనవరిలో కొత్త రేషన్‌కార్డులు

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత జనవరిలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ తెలిపారు. మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం ఇస్తామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మూడు గంటలే కరెంట్ వస్తుంది. ఆ పార్టీకి ఓటేస్తే మనకు మరణమే. కరెంట్ కావాలా? కాంగ్రెస్ కావాలా? అప్పట్లో రూ.200 పింఛన్ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు రూ. నాలుగు వేలు ఇస్తామంటున్నారు. కాంగ్రెస్ మాటలు నమ్ముతామా?" అని కెటిఆర్ అన్నారు. 2014లో రూ.400 ఉన్న సిలిండర్ ప్రస్తుతం రూ.1200 అయ్యింది. మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి రూ.ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. 70 లక్షల రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లను బిఆర్ఎస్ జమ చేసిందన్నారు. కెసిఆర్ పోరాటంతో మనకు తెలంగాణ సాకారమైందని చెప్పారు. ఆయన దీక్షతో కేంద్రం దిగివచ్చి తెలంగాణ ప్రకటించిందన్నారు. ఈసారి కూడా నవంబర్ 29న దీక్షాదివస్ నిర్వహిస్తామని, బిఆర్ఎస్ శ్రేణులు ఎక్కడివారు అక్కడ దీక్షాదివస్ నిర్వహించాలన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టాలి. అస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయాలి అని కెటిఆర్ పిలుపునిచ్చారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి తన పాత పార్టీ బిజెపిపై ప్రేమ ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే గోషామహల్, కరీంనగర్, కోరుట్లలో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను పెట్టిందని ఆరోపించారు. గోషామహల్‌లో బిజెపి అభ్యర్థిని ఓడిస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు.

ఇబ్రహీంపట్నం గడ్డపై సిపిఎం నిలవాలి

- భూబకాసురులను తరిమికొట్టాలి
- అదానీ, అంబానీలకు మోడీ గులాంగిరీ
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే గ్యారెంటీ లేదు.. ఆరు గ్యారెంటీలకు ఇంకక్కడ
- మరోసారి మాయ మాటలతో కెసిఆర్ ముందుకు..
- పేదల జెండా.. ఎర్రజెండాకు అండగా ఉండండి
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"రైతాంగ సాయుధ పోరాటం సాగిన నేల.. దేశంలో భూ సంస్కరణలకు కారణమైన పోరాట గడ్డపై సిపిఎం జెండా ఎగరాలి.. ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని భూబకాసురులను తరిమికొట్టాలి" అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి పగడాల యాదయ్య ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలో రోడ్ షో నిర్వహించారు. కళాకారుల ఆటపాటలు, నృత్యాలతో ర్యాలీ సాగింది. అనంతరం సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో బృందా కరత్ ప్రసంగించారు. ప్రధాని మోడీ అదానీ, అంబానీలకు గులాంగిరీ చేస్తూ.. రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తూ.. పేదల సంపదను దోచిపెడుతున్న రాజకీయ పార్టీలను మట్టికరిపించేందుకు ప్రజలు రాజకీయ చైతన్యంతో ఆలోచించి.. తమ హక్కులను కాపాడే సిపిఎం అభ్యర్థులను చట్ట సభలకు పంపించాలని కోరారు.

ఈ ప్రాంతంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న నాయకులు భూ దోపిడీకి పాల్పడ్డారు తప్ప.. ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. కమ్యూనిస్టులు పేదలకు పంచిన అసైన్డ్ భూములను లాక్కోవడం తప్ప వాటికి పట్టాలు ఇచ్చింది లేదన్నారు. 'ఫార్మాసిటీకి కేటాయించిన భూములు ఎవరివి.. ఆ భూములపై ఎవరికి హక్కు ఉంది' అని బృందా కరత్ ప్రజలను అడగ్గా.. 'ఆ భూములు మావి.. మా వద్ద బలవంతంగా లాక్కొన్నారు' అని బదులిచ్చారు. ఎన్నో ఎండ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగించిన పేదల పొట్టకొట్టిన ఈ పాలకులను ఓడించాలని బృందా కరత్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. నిరుద్యోగ సమస్యలను గాలి వదిలిందన్నారు. ఈ ప్రాంత రైతులకు సాగు నీరు ఇవ్వలేదన్నారు. తాగు నీటి సమస్యలు అట్లే ఉన్నాయన్నారు. రెండు సార్లు కెసిఆర్ ప్రజలను మోసం చేశారని చెప్పారు. మరోసారి మాయ మాటలతో ప్రజల ముందుకు వస్తున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండి సరైన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఉంటారో పోతారో వారికే గ్యారంటీ లేదు.. ఆరు గ్యారంటీలు అమలు ఏంటీ గ్యారంటని ప్రశ్నించారు. ప్రజల హక్కుల కోసం ఎర్రజెండా పోరాటం చేస్తుంటే.. కాంగ్రెస్ ఇన్నాళ్లు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు.

సభలో మాట్లాడుతున్న బృందా కరత్

ఎర్రజెండా దళిత, గిరిజన, అసైన్డ్, పోడు భూముల కోసం నిర్విరామ పోరాటం చేసిందన్నారు. ప్రజల గొంతుకగా అసెంబ్లీలో ఎర్రజెండాను నిలపాలనికోంది. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు భూపాల్, జయలక్ష్మి, ధర్మనాయక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, మధుసూదన్‌రెడ్డి, జగదీశ్, కవిత, రాజు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో పట్టు తప్పుతున్న ఎంఐఎం

- ముంతాజ్ ఖాన్, పాషాఖాద్రీ గ్రూపుల సహాయ నిరాకరణ
- ఉద్యోగులు, విద్యావంతుల్లో వ్యతిరేకత
- రాజేంద్రనగర్ జూబ్లీహిల్స్‌లో నామమాత్రపు పోటీ
- మలక్‌పేట, నాంపల్లిలో తగ్గుతున్న గ్రాఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత బస్తీలో ఎంఐఎం పట్టుతప్పుతోందా అంటే? అవుననే సమాధానం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పతంగి హవా ఈ సారీ కొనసాగడం కష్టమేనని తెలుస్తోంది. పోటీ చేస్తున్న తొమ్మిది స్థానాలో చార్మినార్, చాంద్రాయణ గుట్ట, బహదూర్ పుర, కార్వాన్, యాఖత్ పురాల్లో గెలుపు నల్లేరు మీద నడకే అయినప్పటికీ, నాంపల్లి, మలక్ పేట స్థానాల్లో గెలుపు అంత సులువు కాదని ప్రస్తుత పరిణామాలు తెలియ జేస్తున్నాయి. రాజేంద్ర నగర్, జూబ్లీహిల్స్‌ల్లో అయితే ఆ పార్టీ నామమాత్రపు పోటీకే పరిమితం కానుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో గెలుచుకున్న ఏడు స్థానాల్లో ఈ సారీ రెండు స్థానాలు మైనస్ అవుతాయేమోననే ఆందోళన ఆ పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. మజ్లీస్ ఇత్తెహాదుల్ ముస్లీమీన్ (ఎంఐఎం) పార్టీకి గత 30 ఏండ్లుగా పాత బస్తీ కంచుకోట.చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర, కార్వాన్, యాఖత్‌పురా నియోజకవర్గాల్లో వరుసగా ఐదు సార్లకు పైగా విజయం సాధించింది. నాంపల్లిలో నాలుగు సార్లు, మలక్ పేటలో మూడు సార్లు వరుసగా గెలిచింది. మారిన రాష్ట్ర రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ బలంగా పుంజుకోవడం, మైనార్టీ వర్గానికి చెందిన విద్యావంతులు, ఉద్యోగులు, మేధావి వర్గాల్లో ఎంఐఎంపై తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందనేది పలువురి వాదన. హైదరాబాద్ నగరం చుట్టూ 50 కిలోమీటర్ల వరకు విస్తరిస్తున్నా, అభివృద్ధికి నోచుకోకుండా పాత బస్తీమాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందనా తయారైందనే అసంతృప్తి అన్ని వర్గాల్లో ఏర్పడింది. వయసు పైబడిందనే కారణంతో టికెట్లు కోల్పోయిన పాషా ఖాద్రి, ముంతాజ్ అహ్మద్ ఖాన్ వర్గాలు సహాయ నిరాకరణ చేస్తున్నాయి తమ తర్వాత తమ కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తామని మాజీ ఎంపి సలావుద్దీన్ ఒవైసీతో కుదిరిన ఒప్పందం మేరకే తాము ఎంబిటి నుంచి తిరిగి ఎంఐఎంలోకి వచ్చామని వారంటున్నారు. అసదుద్దీన్, అక్బరుద్దీన్‌లు ఒప్పందాన్ని కాదని ఇతరులకు టికెట్ కేటాయించారని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇద్దరు నేతలను పార్టీలో చేర్చుకుని టికెట్లు ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికి ఎన్నికల సమయంలో పార్టీ మారితే తప్పుడు సంకేతాలు పోతాయనే ఉద్దేశంతో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు మౌనంగా ఉన్నట్టు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. 1957లో ఏర్పడ్డ మలక్ పేట స్థానానికి ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్ ఐదు సార్లు, బిజెపి రెండు సార్లు, జనతా పార్టీ ఒక సారీ, ఎంఐఎం నాలుగు సారు విజయం సాధించాయి. పార్టీ శ్రేణుల్లో నెలకొన్న అసంతృప్తికి తోడు సిట్టింగ్ ఎమ్మెల్యే బలాల ఏకపక్ష వైఖరితో ఈ సారి గెలుపు అంత సులువు కాదని పార్టీ వర్గాలే అంటున్నాయి. నాంపల్లికి నాలుగు సార్లు జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నప్పటికి ఈ సారీ అంత గెలుపు కొంత కష్టమని భావిస్తున్నారు. 2014, 2018 ఎన్నికల్లో ఓటమి పాలయిన ఫిరోజ్ ఖాన్ మూడో సారీ కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగారు. ఆ పార్టీ హవాకు తోడు సానుభూతి తోడై ఫిరోజ్ గెలుపుకు అవకాశాలు ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయి. . ఇక రాజేంద్ర నగర్, జూబ్లీహిల్స్‌లో పోటీ నామమాత్రంగా తయారైంది. బిఆర్ఎస్ సిట్టింగ్‌లను ఓడించేందుకే తప్ప గెలిచేందుకు పోటీ చేయడం లేదని స్వయంగా అసదుద్దీన్ చెప్పడంతో పార్టీ వర్గాలు కూడా ఈ స్థానాలను అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఎంఐఎంకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అమర వీరుల ఆకాంక్షలు నెరవేరలేదు

- ఎఐసిసి జాతీయ నేత కన్నయ్య కుమార్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమర వీరుల ఆకాంక్షలు నెరవేరలేదని ఎఐసిసి జాతీయ నేత కన్నయ్య కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎన్ఎస్‌యుఐ నేతలతో కలిసి ఆయన 'తెలంగాణ ఎలక్షన్ క్వశ్చన్ పేపర్'ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కన్నయ్యకుమార్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల రోజు ఈ పేపర్ ఫలితాలు వస్తాయని ఎద్దేవా చేశారు. విద్యార్థిని ప్రవళికది ఆత్మహత్య కాదనీ, ఈ వ్యవస్థలో సర్కార్ చేసిన హత్య అని చెప్పారు. పదేండ్లలో ఉద్యోగాల భర్తీ సక్రమంగా జరగలేదన్నారు. తెలంగాణ ప్రజలకు వచ్చిన ఏ ఒక్క హామీని సిఎం కెసిఆర్ నెరవేర్చలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం ఒయు కేంద్రంగా జరిగిందన్నారు. ఆ విద్యార్థులను బిఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదని విమర్శించారు.

ధర్మం పేరిట మతాల మధ్య చిచ్చు

- దేవుడిని రాజకీయాలకు వాడుకుంటున్నారు
- బిజెపి నేతలపై దిగ్విజయ్‌సింగ్ ఆగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి పార్టీ దేవుడుని రాజకీయాలకు వాడుకుంటోందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్ ఆరోపించారు. ధర్మం పేరిట మతాల మధ్య బిజెపి చిచ్చు పెడుతోందని విమర్శించారు. విభజన రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగాన్ని ఆ పార్టీ బలహీనపరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదరికం, నిరుద్యోగం భారీగా పెరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలోనూ అలాంటి పరిస్థితే ఉందనీ, ఎవరూ సంతోషంగాలేరని తెలిపారు. రైతులు, నిరుద్యోగులు అందరూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పేపర్ లీకులతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. 26/11 దాడుల్లో మరణించిన వారికి ఆయన నివాళులర్పించారు. భారత రాజ్యాంగంలో అన్ని వర్గాలకూ సమన్యాయం జరిగేలా, వారి బతుకులు బాగుపడేలా అంబేద్కర్ హక్కులు కల్పించారని తెలిపారు.

ప్రతి వ్యక్తిలో అంతర్గత ప్రతిభ ఉంటుంది

- జస్టిస్ బి శేష శయనారెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

ప్రతి వ్యక్తిలోనూ అంతర్గతంగా ఏదో ప్రతిభ దాగి వుంటుందని, కృషి పట్టుదలతో వెలుగులోకి తెవచ్చని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి శేష శయన రెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ఆరాధన సాంస్కృతిక సంస్థ నిర్వహణలో వివిధ తెలుగు చానల్స్‌లో ప్రసారం అవుతున్న సీరియల్స్ ఇతర కార్యక్రమాల కళాకారులకు పురస్కారాలతోపాటు అక్కినేని పేరిట జీవిత సాఫల్య పురస్కారాలు నటులు జివి నారాయణ రావు, జెఎల్ శ్రీనివాస్, టివి న్యూస్ డెస్క్ నిర్వహకులు శ్రీశైలం యాదవ్, ఎం నాగరాజు ఆంధ్రప్రభ ఢిల్లీ బ్యూరో స్వరూపలకు అందజేశారు. సినీ దర్శకులు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ టివి సీరియల్స్‌లోని కళాకారులకు పెద్ద తెర కళాకారులకు ఉన్నంత క్రేజ్ ఉందని తెలిపారు. మోహన్ కృష్ణ, సంస్థ నిర్వాహకుడు లోకం కృష్ణయ్య, సామాజిక సేవకుడు హనుమంతరావు అధ్యక్షత వహించిన సభలో పారిశ్రామిక వేత్త చిల్ల రాజశేఖరరెడ్డి, యువ కళా వాహిని లంక లక్ష్మీనారాయణ, వెంకట రెడ్డి, ఇందిర దేవి, కె విజయ లక్ష్మి పాల్గొన్నారు.

యాభై ఏళ్ల దరిద్ర్యాన్ని పదేళ్లలో పోగొట్టాం

- ఇందిరమ్మ రాజ్యంలో ఏవర్గమూ బాగుపడలేదు
- ఆరు గ్యారంటీలు చూసి మోసపోకండి
- కేరళ మాదిరి పూర్తి అక్షరాస్యత రాష్ట్రంగా తెలంగాణ మారాలి
- ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్

సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేండ్లలో ఓ వైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమంతో 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనా దరిద్ర్యాన్ని పోగొట్టుకున్నాం. మళ్లీ వాళ్లు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెబుతున్నారు. ఆ రాజ్యంలో ఏ వర్గమూ బాగుపడలేదు" అని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. ఈ ఎన్నికల్లో మాయమాటలు చెబుతూ వస్తున్న వారిని ప్రజాస్వామ్య పరిణితితో ఆలోచించి తిప్పికొట్టాలని, బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జగిత్యాల, వేములవాడ, దుబ్బాక, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఆదివారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి ఎక్కడా లేదని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని కెసిఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజాసామ్య పరిణితితో ఓట్లు వేస్తారని, ఇక్కడా అలాంటి వాతావరణమే రావాలని అన్నారు. తనకు పదవులపై ఆశ లేదన్నారు. పేదరికంలేని తెలంగాణను చూడాలన్నదే తన కోరిక అని, ఆ దిశగా రాష్ట్రాన్ని బాగు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఎవరూ వరుసగా పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగలేదని, తాను మాత్రమే ఉన్నానని తెలిపారు. కేరళలో మాదిరిగా వందశాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా తెలంగాణను తయారు చేసుకోవలసిన అవసరముందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు.. అసలు ఆ రాజ్యంలో కరువు కాటకాలే తప్ప జనాలకు ఒరిగిందేమిటో చెప్పాలన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలోనే తన పెండ్లి జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడి ఎమ్మెల్యే రమేష్‌బాబు నిజాయితీపరుడని, అయినా ఆయనపై కోర్టులో ఉన్న దిక్కుమాలిన కేసు మూలంగా ఆయన స్థానంలో విద్యావంతుడు లక్ష్మీనర్సింహారావుకు అవకాశం ఇచ్చామని తెలిపారు. రైతుబంధు పదాన్ని పుట్టించిందే కెసిఆర్. కాంగ్రెస్‌ది భూమాత కాదు.. భూ మేత. రఘునందన్‌కు ఏమీ తెలియదు. ప్రజాస్వామ్యంలో ఓటే ప్రజల ఆయుధం. ప్రభాకర్‌రెడ్డిని గెలిపించండి. దుబ్బాక అభివృద్ధి నేను చూసుకుంటా' అని సిఎం కెసిఆర్ అన్నారు. ఉప ఎన్నికల్లో నేను రాలే.. అందుకే ఓడిపోయాం.. నేను వచ్చుంటే రఘునందన్ పని ఒడిశిపోవు.. నోటికి వచ్చిన హామీలు ఇచ్చి 'ఏక్ అణా పని చేయలేదని ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై నిప్పులు చెరిగారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటేస్తే గోసపడతామన్నారు. కాంగ్రెస్ రూపొందించిన ఆరు గ్యారెంటీలను నమ్మి వారికి ఓటేస్తే మోసపోతారని ఖానాపూర్‌లో సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. ఓటు వేసేటప్పుడు ఆగమాగం కావద్దని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ ప్రచార సభల్లో మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ సిఎం భూపేష్ బఘేల్

ఛత్తీస్‌గఢ్‌లా ఇక్కడా గ్యారంటీలను అమలు చేస్తాం..

- తెలంగాణను కెసిఆర్ అప్పుల్లోకి నెట్టారు
- ఛత్తీస్‌గఢ్ సిఎం భూపేష్ బఘేల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం గ్యారంటీలను అమలు చేస్తోందని.. అలాగే తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో, వరంగల్ జిల్లా కాజీపేటలో కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం సభల్లో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోడీకి బీఆర్ఎస్, ఎంఐఎం బీటీమ్ అని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మోజార్టీతో గెలిపించి గిఫ్ట్‌గా ఇవ్వాలని ఓటర్లను కోరారు.

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను దోచుకొని పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలను దోచుకుంటున్న ఆ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రజలపై భారాలు వేస్తూ ఆస్తులు కూడపెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఎన్నికల్లో నాలుగు రాష్ట్రాల్లో తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బిజెపి ఒకటేనని, ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పస్రాలో వివాదాస్పదమైన పోల్ చీటీల పంపిణీ

- ఎన్నికల అధికారికి కాంగ్రెస్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో ఆదివారం బిఆర్ఎస్ కార్యకర్తలు కారు గుర్తు.. బడే నాగజ్యోతి ఫొటోతో ఉన్న పోల్ చీటీలు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. పస్రాలో విధులు నిర్వర్తిస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి శ్రీనివాస్‌కు సంబంధిత పోల్ స్లిప్పులను చూపించారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్టు అధికారి శ్రీనివాస్ తెలిపారు. వాస్తవానికి ఓటరు పోల్ స్లిప్పులను ఇప్పటికే బూత్ లెవెల్ అధికారి, ఆశా కార్యకర్తలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు పోల్ స్లిప్పులను పంపిణీ చేయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ అతిక్రమించి పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి సంఘటనలు తలెత్తినా సి విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు.

ఢిల్లీ పార్టీలను ఓడించాలి

- గల్లీ పార్టీ నేత కెసిఆర్‌ను గెలిపించాలి
- మణికొండ బిఆర్ఎస్ ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు

ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలప్పుడు వచ్చి మాయ మాటలు చెప్పే ఢిల్లీ పార్టీలను ఓడించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గల్లీ పార్టీ నేత కెసిఆర్‌ను గెలిపించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిచెట్టు వద్ద బిఆర్ఎస్ రాజేంద్రనగర్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను గెలిపించి కష్టాలు తెచ్చుకోవద్దన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే కెసిఆర్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ హయాంలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. మళ్లీ గెలిస్తే మూడు నెలల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే రిస్కుతోపాటు కరెంట్ కోతలు, నగరంలో అల్లర్లు వస్తాయన్నారు. ఇసుక మాఫీయా రాజ్యమేలుతుందని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చి ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. తమ పార్టీని విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాక గాంధీ, అమిత్ షా, ఇతర ఢిల్లీ నేతలు మూడు రోజులైతే తిరిగి వెళ్లి పోతారని.. సిఎం కెసిఆర్ ఇక్కడే ఉంటారని, తెలంగాణ కోసమే పనిచేస్తారని చెప్పారు. ప్రకాశ్‌గౌడ్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రేఖాయాదగిరి, మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు రామేశ్వరం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపి, ఎంఐఎం, జనసేనలను ఓడించండి

- సామ్యవాద, ప్రజాస్వామిక, లౌకిక శక్తులను గెలిపించాలి
- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో మతోన్మాద బిజెపి, ఎంఐఎం, జనసేన పార్టీలను ఓడించి, సామ్యవాద, లౌకిక శక్తులను గెలిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సామ్యవాద, లౌకిక శక్తుల ఓట్ల చీలిక నివారించేందుకే ఎన్నికల్లో ఆప్ పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం, ఆప్ 11వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆప్ జెండాను ఆవిష్కరించారు. 11 ఏండ్లలో అనేక అవరోధాలను అధిగమించి ఆప్ జాతీయ పార్టీగా ఎదిగిందన్నారు. బిజెపి ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు, విభజన రాజకీయాల కారణంగా రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మతతత్వాన్ని పెంచి పోషిచడం వల్లే ఉగ్రవాదం పెరుగుతుందనీ, ఇందుకు ముంబయి ఉగ్ర దాడులే ఉదాహరణ అని, మతతత్వాన్ని అణిచివేస్తే ఉగ్రవాదం వేర్లు తెగుతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడకుండా ఆప్ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందరికీ ఉచిత వైద్యం, ఉచిత తాగునీరు, ఉచిత విద్యుత్, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, సీనియర్ సిటీజన్లకు ఉచితంగా తీర్థయాత్రలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిర్మూలన తదితర సేవలనందించిన ఆప్‌ను ఢిల్లీ ప్రజలు మూడో సారి అధికారంలోకి తెచ్చారని తెలిపారు.బిజెపి హయంలో సిబిఐ, ఇడిలు మూడు వేల కేసులు నమోదు చేస్తే 23 మందికి మాత్రమే శిక్ష పడిందని తెలిపారు. మిగిలిన వారిలో పలువురు బిజెపిలో చేరిన తర్వాత వారి కేసులు మాఫీ చేసి వారికి మరింత పెద్ద రాజకీయ పదవులిచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు మొహమ్మద్ మజీద్, సోలొమన్ రాజు, డాక్టర్ అన్సారీ, అధికార ప్రతినిధి వినయ్ రెడ్డి, జావీద్ షరీఫ్, ఫణి భూషణ్, పరీక్షణ్ రాజ్, నేతలు మోమిన్, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఐదు హామీలు అమలు

- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కెసిఆర్ అబద్ధాలు
- బిజెపి 40 శాతం కమీషన్‌పై విచారణకు ఆదేశించాం
- కర్ణాటక సిఎం సిద్ధ రామయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక ప్రభుత్వంపైనా, ఐదు గ్యారంటీలపై సిఎం కెసిఆర్, ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కర్ణాటక సిఎం సిద్ధ రామయ్య విమర్శించారు. కర్ణాటకకు రండి... వాస్తవాలు తీసుకోండి అని సిఎం కెసిఆర్‌ను కోరారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను అమలు జరిపామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆ రాష్ట్ర మంత్రులు బోస్‌రాజు, లక్ష్మి, నాగేంద్ర, తెలంగాణ సీనియర్ నేత వి హనుమంతరావుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేయలేదంటూ కెసిఆర్ ప్రచారం చేయడం తగదన్నారు. అందులో వాస్తవం లేదన్నారు. శక్తి యోజన ద్వారా మొదటి గ్యారంటీ పథకాలను జూన్ 11న అమలు చేశామన్నారు. 100.42 కోట్ల మంది మహిళలు ఇప్పటి వరకు కర్ణాటకలో ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. రోజుకు 62 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారని వివరించారు. తన భార్యతోపాటు మహిళా మంత్రులు కూడా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారని గుర్తు చేశారు. అన్న భాగ్య ద్వారా ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యం ఇవ్వాలని హామీ ఇచ్చామన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్ణాటకకు బియ్యం ఇవ్వకపోవడం వల్ల ఒక్కో కేజీకి 34 రూపాయలు చెల్లిస్తున్నామన్నారు. బియ్యం ఇవ్వాలని ఫుడ్ కార్పొరేషన్ ఇండియాను కోరినట్టు తెలిపారు. 4.37 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని, వారికి జులై మొదటి వారం నుంచి అన్న భాగ్యను అమలు చేస్తామన్నారు. గృహజ్యోతి పథకాన్ని జులై నుంచి అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీని ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా కోటి 17లక్షల మంది మహిళలకు రూ. 2000 చొప్పున అందిస్తున్నట్టు తెలిపారు. ఈ రకంగా నాలుగు గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఐదవ గ్యారంటీ యువనిధి ద్వారా వచ్చే జనవరి నుంచి నిరుద్యోగులకు రూ. 3వేలు అందిస్తామన్నారు. వీటితోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తామన్నారు. ఇప్పటి వరకు రూ. 36-38 వేల కోట్ల నిధులు కేటాయించామన్నారు. వచ్చే సంవత్సరానికి రూ. 58 వేలకోట్లు ఖర్చు చేయబోతున్నట్టు వివరించారు. ఇచ్చిన 165 హామీల్లో ..158 ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. గతంలో బిజెపి ఇచ్చిన 600 హామీల్లో కేవలం పది శాతం మాత్రమే అమలు చేసిందని విమర్శించారు. మొన్న ప్రచారానికి వచ్చినప్పుడు కేసీఆర్‌ను కర్ణాటకకు వచ్చి తాము అమలు చేస్తున్న పథకాలు చూడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజలను ఎప్పుడు మోసం చేయదని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నదని చెప్పారు. కర్ణాటక దివాళా తీస్తుందన్న వాదనల్లో వాస్తవం లేదన్నారు. గ్యారంటీలను అమలు చేసేందుకు తమకు డబ్బులకు కొదవ లేదన్నారు. రాష్ట్రంలో నూటికి నూరుశాతం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. యడ్యూరప్పను సిఎం పదవి నుంచి తొలగించినప్పటి నుంచి ఫ్రస్టేషన్‌కు గురి అవుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పై ఆయన చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కర్ణాటక బిజెపిపై 40 శాతం కమీషన్ ఆరోపణ కాంగ్రెస్ ది కాదనీ, అది కాంట్రాక్టర్లు చేసిందన్నారు. వాటిపై కాంగ్రెస్ సర్కారు విచారణ జరుపుతుందని చెప్పారు. దశల వారీగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని తెలిపారు. మోడీ ప్రభుత్వం రాక ముందు గ్యాస్ ధర రూ. 430 ఉంటే, ఇప్పుడు రూ. 1200 ఉందన్నారు. తెలంగాణలో ధర్నా చేసింది కర్ణాటక తమ రాష్ట్ర రైతులు కాదనీ, తమ రైతులు అక్కడ ధర్నా చేయకుండా ఇక్కడేందుకు చేస్తారని ప్రశ్నించారు. కెసిఆర్‌కు భయం పట్టుకుందన్నారు. డిసెంబర్ 3న కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది..అప్పుడూ మళ్లీ వస్తానని వ్యాఖ్యానించారు.

ప్రచార సభలో మాట్లాడుతున్న యుపి సిఎం యోగి

అవినీతి పాలనను అంతమొందించండి

- యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అవినీతి, అక్రమాల కెసిఆర్ కుటుంబ పాలనను అంతమొందించాలని ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి తల్లోజు ఆచారికి మద్దతుగా ఆదివారం ఆమనగల్ పట్టణంలోని అయ్యప్పకొండ సమీపంలో ప్రజాదీవెన సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో యోగి మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణ.. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని తొమ్మిదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆరోపించారు. అన్నిరంగాల్లో వెనుకబడిన కల్వకుర్తి ప్రాంతంలో రైల్వే లైన్, నాలుగు లైన్ల జాతీయ రహదారి, మెడికల్ కాలేజీ తదితర అభివృద్ధి పనులు జరగాలంటే డబుల్ ఇంజన్ సర్కార్‌కే సాధ్యమవుతుందని చెప్పుకొచ్చారు. అందుకోసం బిజెపి అభ్యర్థి తల్లోజు ఆచారికి మద్దతుగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. అంతకు ముందు రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్‌తో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ఆచారి మాట్లాడారు. ఆశీర్వదించి గెలిపిస్తే కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా, ఆమనగల్‌ను నియోజకవర్గంగా ఏర్పాటు చేయడంతోపాటు ఆర్‌డిఒ, ఎస్‌టిఒ, రిజిస్ట్రేషన్ ఆఫీస్, ఆర్‌టిఒ కార్యాలయాలు, రైల్వే లైన్, ట్రిబుల్ ఆర్, నాలుగు లైన్ల హైవే జాతీయ రహదారి ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతానని హామీ ఇచ్చారు.

అవినీతిలో కూరుకుపోయిన బిఆర్ఎస్

- కెసిఆర్ భూకబ్జా ఉద్యమం చేస్తున్నారు
- బిజెపి అధికారంలోకి రాగానే అవినీతిపై విచారణ
- సకల జనుల విజయసంకల్ప సభల్లో అమిత్ షా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. యాదాద్రి భువనగిరి, ములుగు జిల్లాల్లో ఆదివారం జరిగిన సకలజనుల విజయ సంకల్ప సభల్లో ఆయన ప్రసంగించారు. అవినీతి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తమ ఓటు ద్వారా గద్దె దింపాలని కోరారు. కెసిఆర్ నిరుద్యోగ భృతి ఇస్తానని మాట తప్పారన్నారు. భూదాన్ పోచంపల్లిలో వినోబాబావే భూదానోద్యమం చేస్తే.. కెసిఆర్ భూకబ్జా ఉద్యమం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కెసిఆర్ కబ్జా చేశారని ఆరోపించారు. బిజెపి అధికారంలోకి రాగానే కెసిఆర్ వినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి జైలులో పెడ్తామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కెసిఆర్‌కు వేసినట్టేనన్నారు. ఎస్‌సి వర్గీకరణకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సర్కార్ మిషన్ భగీరథ, మద్యం, ఓఆర్ఆర్, మిషన్ కాకతీయ, కాళేశ్వరం లాంటి అనేక కుంభకోణాలు చేసి ప్రజాధనాన్ని లూటీ చేసిందని ఆరోపించారు. బిజెపి అధికారంలోకి రాగానే భువనగిరి ఖిల్లాను రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తామని చెప్పారు.

పథకాల పేరుతో వేలకోట్లు ముంచిన బిఆర్ఎస్

పథకాల పేరుతో రూ.వేల కోట్లు ముంచిన బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని అమిత్‌షా అన్నారు. ములుగులో ఆయన మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వస్తే జాతీయ గిరిజన యూనివర్సిటీకి భూమి ఇస్తామని, రూ.300 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతీయ ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేసి దాని ద్వారా దేశవ్యాప్తంగా గిరిజన ఉత్పత్తులను మార్కెట్ చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గిరిజనుల ఆర్థిక ప్రమాణాలను మెరుగుపరుస్తామన్నారు. పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఏజెన్సీలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇస్తామని తెలిపారు. ములుగులో పేపర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సిఎం కెసిఆర్ ఒవైసికి భయపడుతున్నారన్నారు. సభల్లో బిజెపి భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే అభ్యర్థి పడాల శ్రీనివాస్, ములుగు అభ్యర్థి అజ్మీర ప్రహ్లాద్ పాల్గొన్నారు.

మాగంటి గోపీనాథ్‌కు మైనార్టీ నేతల మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్‌లో చేరిన ముస్లిం మైనార్టీ నాయకులు

జూబ్లీ హిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివారం జూబ్లీ హిల్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మైనార్టీ సోదరులు బిఆర్ఎస్‌లో చేరారు. మాగంటిని సన్మానించినవారు బిఆర్ఎస్‌కు అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో సిఎం కెసిఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. మైనార్టీల సంక్షేమానికి బిఆర్ఎస్ కట్టుబడి ఉందన్నారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మూడో సారి కెసిఆర్‌ను సిఎం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని మాగంటి కోరారు.

మెట్‌పల్లి గురుకులంలో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి బాలికల గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతున్న దాసరి విశ్వాని మృతికి హాస్టల్ ప్రిన్సిపల్ నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మోతుకూరి యాదయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయమై గురుకుల కార్యదర్శి నవీన్ నికోలస్ పూర్తి విచారణ చేసి సంబంధిత ప్రిన్సిపల్, హౌస్ టీచర్, సూపర్‌వైజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి న్యాయం జరిగేలా కార్యదర్శి చర్యలు చేపట్టాలనీ, లేనిపక్షంలో ఆదే హాస్టల్ ముందు మృతి చెందిన విశ్వాని మృతదేహంతో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఎడమ కుడి అయితే.. పొరపాటే

- కొంప ముంచనున్న పైపై ప్రచారం
- 50 ఏళ్లు దాటినవారి ఓట్లు క్రాస్ అయ్యే ప్రమాదం
- అభ్యర్థులను టెన్షన్ పెట్టిస్తున్న వైనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'కుడి..ఎడమైతే పొరపాటు లేదోయ్..' పాటను కాస్తా ఈ ఎన్నికలకు అన్వయించుకుంటే...'ఎడమ..కుడి అయితే.. ఎన్నికల్లో ఓడిపోవాల్సిందేనోయ్..' అని అభ్యర్థులు పాడుకోవాల్సిన ప్రమాదం పొంచి ఉంది. ఇవిఎంలలో ఓట్లు వేసే ప్రక్రియపై సరైన అవగాహన కల్పించకపోవడం అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా 50 ఏళ్లు నిండిన వారి నుంచే ఓట్లు ఎక్కువగా క్రాస్ అయ్యే అవకాశ ముంది. ఇప్పటికైనా పోయిందేమీ లేదు..చివరి రెండు రోజుల్లోనే ఓటింగ్ చేసే విధానంపై ఆయా పార్టీల వాళ్లు వివరణాత్మకంగా చెప్పాల్సిందే. లేదంటే నష్టపోవాల్సిందే. ఓటమిని ఎదుర్కో వాల్సిందే. ఆయా పార్టీల అభ్యర్థుల తరఫున ఎన్నికల్లో ప్రచారం చేసేవాళ్లు ఎంతసేపు ఉన్నా అభ్యర్థులు ఈవీఎం బాక్సులో తమ సీరియల్ చెప్పి తమ గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను ప్రాధేయపడుతూ అంతవరకే పరిమితం అవుతున్నారు. కానీ, అంతిమంగా ఓట్లేసే సమయంలో ఇదే అభ్యర్థుల కొంప ముంచే ప్రమాదముంది. మునుగోడు ఉప ఎన్నికలో నాలుగైదు గ్రామాల్లో ఇదే పరిస్థితి తలెత్తింది. రెండో గుర్తుగా ఉన్న కారు గుర్తుకు ఓటేయాలని విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా పోలింగ్ రోజు ఓటు వేసే సమయంలో వృద్ధులు కొంత గందరగోళానికి గురై కుడివైపు నుంచి ఉన్న తొలి ఇవిఎంలోని రెండో గుర్తుకు కొందరు ఓటు వేశారు. మరికొందరు ఆ ఇవిఎంలో కారును పోలి ఉన్న గుర్తులపై ఓటేసిపోయారు. ఇలా వెళ్లి అలా చివర్లోనే ఓటేసి వస్తుండటంపై ఏజెంట్లు ఆందోళనకు గురై సమాచారానికి తమ పార్టీ నేతలకు ఉప్పందించారు. దీంతో అప్పుడు అలర్ట్ అయి వృద్ధులు, కంటిచూపు సరిగా లేనివారితో పాటు గందరగోళానికి గురయ్యే వారికి గుర్తుపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఎడమవైపు నుంచి మొదటి ఇవిఎంలోని రెండో గుర్తుగా ఉన్న తమ పార్టీ సింబల్‌పై ఓటేయాలని సూచించారు. ఆ తర్వాత ఇండిపెండెంట్లకు, కారును పోలి ఉన్న గుర్తులకు ఓట్లు పడటం తక్కువైపోయింది. ఈ ఎన్నికల్లోనూ రెండు కంటే ఎక్కువ ఇవిఎంలు (16 మంది అభ్యర్థుల కంటే ఎక్కువ పోటీలో ఉండటం) ఉన్న చోట ఇలాంటి పరిస్థితే ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయి. ఎంత సేపూ ఒకపేపర్ పట్టుకుని తమ అభ్యర్థి సీరియల్ నెంబర్, సింబల్ ముద్రించి దాన్నే చూపుతున్నారు. ఇలా కాకుండా నమూనా ఇవిఎంలతో ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. ముఖ్యంగా వృద్ధులు, పాక్షిక దృష్టిలోపం గలవారు, గందరగోళానికి గురయ్యేవారికి మరింత విడమర్చి చెప్పాల్సిన బాధ్యత ఆయా పార్టీల అభ్యర్థులపై ఉంది. అదే సమయంలో తమ ఓటు ఏ గుర్తుపై పడిందో చూసుకునే విధానంపైనా ఓటర్లకు అవగాహన కల్పించాలి. లేకపోతే వారి ఓట్లు ఇండిపెండెంట్‌లు, ఇతర పార్టీల అభ్యర్థులకు పడే ప్రమాదం పొంచి ఉంది తస్మాత్ జాగ్రత్త.